కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి

28, 29లో జరిగే మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవీ.నాగేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కార్మికులందరూ బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో దానికి వ్యతిరేకంగా ఈనెల 9న జరిగిన దేశవ్యాప్త సమ్మె చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. గతంలో జరిగిన సమ్మెల కంటే ఈ సమ్మెకు ఎక్కువ స్పందన వచ్చిందని కార్మికుల పాల్గొన్న సంఖ్యను చూస్తే అర్థమవుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు స్కీం వర్కర్లైన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వీవోఏ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చిన అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 11 నెలలుగా బకాయి వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. అసంఘటితరంగా కార్మికులైన భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులకు భద్రత లేక అవస్థ పడుతున్నారని అన్నారు. స్కీం వర్కర్లపై పనిభారం పెంచి ఉపాధి లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకరకంగా, అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక రకంగా వ్యవహరించడం దారుణమన్నారు. జిల్లాలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మిక వర్గం ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న సిఐటియును జిల్లాలో కార్మికవర్గం బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 28,29 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు ఎంత బలపడితే కార్మికుల సమస్యలు అంత తొందరగా పరిష్కారం అవుతాయని తెలిపారు. క్షేత్ర నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని కమిటీల మహాసభలు జరిపి నాయకత్వాన్ని ఎన్నుకొని సమస్యలపై సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేయాలని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్త, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, నాయకులు షకీలా, మమత, జ్యోతిరావు, గంగ, ఆరోగ్య దాస్, శివ, విజయ, వరలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

జిఎస్ఎల్వి -ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్

నింగిలోకి దూసుకెళ్లిన నిసార్

- మొదటిసారిగా నాసా- ఇస్రో సంయుక్తంగా రాకెట్ ప్రయోగం
- వాతావరణ సమాచారాన్ని చేరవేయనున్న నిసార్ ఉపగ్రహం

నింగిలోకి దూసుకెళుతున్న నిసార్ ఉపగ్రహం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) తొలిసారిగా సంయుక్తంగా రూపొందించిన నాసాబి ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నిసార్) అనే ఉపగ్రహాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించి విజయం సాధించారు. జియో సింక్రానాస్ లాంచింగ్ వెహికల్ (జిఎస్ఎల్విఎఫ్ 16) రాకెట్ ద్వారా 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య సమకాలిక కక్షలోకి నిసార్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. భూగోళాన్ని పరిశోధించేందుకు ఎంతో దోహదపడే ఈ ఉపగ్రహం సుమారు 5ఏళ్ల పాటు సేవలు అందిస్తుందని, భవిష్యత్తులో ఇస్రో- నాసా కలిసి మరిన్ని ప్రయోగాలు చేయనున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ ఇస్రో- నాసా బంధం బలపడి రాబోయే కాలంలో మరో మూడు ప్రయోగాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. నిసార్ ఉపగ్రహంలో ఉన్న సాంకేతిక పరికరాలను సంయుక్తంగా రూపిందించడం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు జరుగుతాయనీ తెలిపారు. అలాగే చంద్రయాన్- 4 ప్రయోగపనులకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి గగనయాన్- 1 పేరుతో ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పిఎస్ఎల్వి సిరీస్‌లో కూడా మరో 4 ప్రయోగాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నిసార్ ఉపగ్రహం పూర్తిగా వాతావరణ సమాచారం కోసం చేస్తున్న ప్రయోగం 2,392 కిలోల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహం 5 సంవత్సరాలు పాటు అంతరిక్షం నుండి సేవలు అందించనుంది. ఈ నిసార్ ఉపగ్రహం ద్వారా విలువైన వాతావరణ సమాచారం అందుతుంది. నిసార్ ఉపగ్రహం ప్రయోగం అనంతరం ప్రతి 12 రోజులకు ఒకసారి భూమిని చుడుతూ పరిశీలించిన సమాచారాన్ని ఇస్రో కేంద్రానికి అందిస్తుంది. ఈ ఉపగ్రహం స్పష్టమైన త్రీడీ చిత్రాలను అందిస్తుంది. ఈ ఉపగ్రహం ప్రకతి విపత్తులను ముందుగానే తెలియజేస్తుంది. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు, సునామి వంటి విపత్కర ప్రమాదాల సమాచారాన్ని ముందుగానే అందిస్తుంది. మంచు పర్వతాల కదలికలు, కొండల చర్యలు కదలకలను నిసార్ ఉపగ్రహం ద్వారా గుర్తించవచ్చు. నిసార్ ఉపగ్రహం నిఘా ఉపగ్రహంగా కూడా ఉపయోగపడుతుంది. ఇది ఇస్రో కేంద్రమైన శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి షార్ చేపట్టిన 102వ ప్రయోగం కాగా జిఎస్ఎల్వి సిరీస్‌లో ఇది 18వ ప్రయోగం.

గ్యాలరీలో పదివేల మంది వీక్షకులు..

గతంలో ఎప్పుడు లేని విధంగా శ్రీహరికోట గ్యాలరీలో దాదాపు పదివేల మంది విద్యార్థులు ఈ ప్రయోగాన్ని వీక్షించారు. ప్రయోగం అనంతరం హర్షద్వానాలతో శ్రీహరికోట మార్మోగింది. ప్రయోగం విజయవంతం కావడంతో నాసా శాస్త్రవేత్తలు, ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రయోగాన్ని గ్యాలరీల్లో వీక్షిస్తున్న విద్యార్థులు

తాలూకా సిఐగా నిత్యబాబు

తాలూకా సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న నిత్యబాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ట్రాఫిక్ సిఐగా పని చేస్తున్న నిత్యాబాబును తాలూకా సిఐగా బదిలీ చేయడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ట్రాఫిక్ నియంత్రణలో నిత్యాబాబు చేసిన కృషి నగరంలో పలువురి ప్రసంశలు అందుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక నిఘా ఉంచడం, చట్టపరంగా అపరాధ రుసుం విధించడం నిత్యాబాబు ప్రత్యేకత. చిత్తూరు ట్రాఫిక్ సిఐగా దాదాపు 3 సంవత్సరాలు పని చేశారు.

చిత్తూరు ట్రాఫిక్ సిఐగా లక్ష్మీనారాయణ

ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు స్వీరిస్తున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూకా సిఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మినారాయణ బదిలీపై చిత్తూరు ట్రాఫిక్ సిఐగా నియమితులైయ్యారు. ఈ మేరకు బుధవారం చిత్తూరు ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నగరంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరంగా అమలు చేయడంతో ట్రాఫిక్ రూల్స్‌ను అనుసరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చెరువు సుందరీకరణకు భూమి పూజ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగర పరిధిలోని కాజూరు చెరువులో ముళ్లకంపల తొలగింపు, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భూమి పూజ చేశారు. మంగళవారం ఉదయం చెరువు వద్ద ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్.అముద భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రాధాన్యతా కార్యక్రమంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. కాజూరు చెరువు, కట్ట సుందరీకరణ ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. ఐఓసిఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో శిల్పారామం, చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్ట్ వంటివి ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రధాన రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయని.. భవిష్యత్తులో చిత్తూరును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ మురళీ కుమార్, డీఈ హీరాలాల్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్ అశోక్, కాజూరు బాలాజీ పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

హెచ్‌ఎంకు ఘన సన్మానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలోని సికేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చెందుతున్న పి.సునందమ్మని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఘనంగా సత్కరించారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత 38 ఏళ్ల పాటు ఉపాధ్యాయవృత్తిలో ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజానికి మంచి పౌరులను అందించిన సునందమ్మను అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శాలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు.

సీఎంసీలో ఆరోగ్యశ్రీ సేవలు అనుమతించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చీలాపల్లి వద్ద ఉన్న సీఎంసీలో ఆరోగ్యసేవలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ముస్లీం ఐఖ్యవేదిక నాయకులు కోరారు. బుధవారం వారు చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్మోన్‌ను కలసి నగరంలోని ప్రజాసమస్యలను తెలియజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సంతపేట షౌకత్, రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎం రషీద్, నియోజకవర్గ అధ్యక్షులు సర్దార్, లీగల్ అడ్వైజర్ ఎస్‌కే అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ రంగంలో పురోగతి సాధించాలి

నేడు నియోజకవర్గాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం : కలెక్టర్

గృహ నిర్మాణాల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): గృహనిర్మాణ రంగంలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పూతలపట్టు, జీడి నెల్లూరు, చిత్తూరు అర్బన్, నియోజకవర్గాల ఎన్టీఆర్ గృహనిర్మాణాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యాలను సాధించడంలో అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గాలలో క్షేత్రస్థాయిలో హౌసింగ్ డీఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గృహనిర్మాణ అధికారులు క్రమం తప్పకుండా స్థలసందర్శనలు నిర్వహించి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడానికి అదనపు ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. జిల్లా అంతటా మొత్తం 73,098 ఇళ్లు మంజూరు చేయడం జరిగింది, వీటిలో 52 880 ఇళ్లు పూర్తి చేయడం జరిగింది, 20,218 22,756 ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి కావలసి ఉన్నది, మిగిలిన ఇళ్ల త్వరితగతిన పూర్తి కావలసి ఉన్నది సంబంధిత అధికారులు లబ్ధిదారులతో చర్చించి వారి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్న నివాస ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఇతర విభాగాలలోని వారి సహచరులతో కలిసి పనిచేయాలని కలెక్టర్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో, హౌసింగ్ అధికారులతో, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బాంబు బెదిరింపు కాల్ పై మాక్ డ్రిల్

మాక్ డ్రిల్‌లో అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): బాంబు బెదిరింపు కాల్స్‌పై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. మండలంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌లో జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఏఆర్.శివానంద కిషోర్ పోలీస్ బాంబు స్క్వాడ్ సిబ్బందితో ఏవైనా బాంబు బెదిరింపు కాల్స్ వస్తే ఎలా స్పందించాలనే దాని పై మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ బాంబు బెదిరింపు కాల్‌ను నిజమైనదిగా భావించి స్పందించాలని, ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితే వచ్చినా, సమర్థవంతంగా, శాస్త్రీయంగా స్పందించే విధంగా అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రాముఖ్యమైన స్థలాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండటమే లక్ష్యంగా మాక్ డ్రిల్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఓసీఎల్ వంటి కీలక స్థలాల్లో ఎప్పటికప్పుడు భద్రతా వ్యవస్థను పునఃపరిశీలిస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, యాదమరి ఎస్ఐ ఈశ్వర్, తహశీల్దార్ పార్థసారథి, ఐఓసీఎల్ సిటిఎం చీఫ్ టెర్మినల్ మేనేజర్ అరుణ్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం గుడిపాల మండలం గుడిపాల సిఎల్‌ఎఫ్‌లో కమ్యూనిటీ నిర్వహణ కేంద్రంను ఎమ్మెల్యే, నగర మేయర్ అముద, డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవిలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిపాలలో కమ్యూనిటీ నిర్వహణ శిక్షణా కేంద్రం ప్రారంభించడం జరిగిందని, ఈకార్యక్రమంలో మహిళలకు రాష్ట్రస్థాయి నుండి ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. చిత్తూరు పట్టణం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అవుతున్నాయని తద్వారా పట్టణాన్ని ప్రత్యేక సుందరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. డిఆర్డిఏ పీడీ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కనీసం ఒక మహిళ అయినా వ్యాపారవేత్తగా ఎదగాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధిని సాధించడమే ఈ శిక్షణా కేంద్రం నిర్వహణ లక్ష్యమని తెలిపారు.

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ గురజాల

నిలిచిపోయిన మురుగునీరు, చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువలు

అడుసుపల్లెలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసు పల్లె గ్రామంలో మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం తొలగించకపోవడంతో కాలువలు పూర్తిగా మట్టితో నిండిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అసలు కాలువ ఉందా లేదా అన్న అనుమానం కలుగుతూ రోడ్డుకు సమాంతరంగా మట్టి పేరుకుపోయి కాలువ ఆచూకీ కూడా లేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ వారు మురుగునీటి కాలువలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేసి మట్టిని తొలగించి తరలించి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు. వ్యర్థాలు, మురుగు పేరుకుపోవడంతో నీరు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వెంటనే పంచాయతీ వారు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్‌డిఓ అధ్యక్షతన ట్రిబ్యునల్..: డిఆర్‌ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం- 2007 విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007, ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం 2019 అమలుపై ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ వినోద్ కుమార్, డీఎస్పీ సాయినాథ్, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, డీఈవో వరలక్ష్మి, సీనియర్ లాయర్ సుజాత, మహిళా విశ్వవిద్యాలం అసోసియేట్ ప్రొఫెస్సర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు. డిఆర్ఓ మాట్లాడుతూ తల్లితండ్రుల, వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబ సభ్యుల బాధ్యత వహించాల్సి ఉందని అన్నారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ తన స్వంత సంపాదన, ఆస్తి నుంచి తనను తాను కాపాడుకోలేక పోయినప్పుడు ప్రాథమికంగా ఆర్‌డిఓ అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు అని తెలిపారు. సీనియర్ సిటిజన్, తల్లిందండ్రుల ఆహారం, వైద్యం, వసతి అవసరాలను నెరవేర్చలేని వారి వారసులకు మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.5వేల జరిమానా విధిస్తారన్నారు. తల్లితండ్రులను చూడాల్సిన బాధ్యత కుమారులు, కుమార్తెకలకు ఉన్నదనిన్నారు. డివిజన్, మండల, గ్రామస్థాయిలో ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

సమావేశంలో చట్టంపై అవగాహన కల్పిస్తున్న డిఆర్‌ఓ

13 వారాలైనా అందని కూలి డబ్బులు

ఉపాధి వేతన వెతలు...

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మండలంలో పనులు చేస్తున్న కూలీలకు కూలి డబ్బులు అందడం లేదు. దాదాపు మూడు నెలలుగా వేతనాలు ఆగిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం ఆరు గంటలకే పనులకు వెళు తూ.. చెమటోడ్చి కష్టిస్తున్నారు. అయినప్పటికీ కనీసం వారానికి ఒకసారి కూడా వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. వేతనాలు సరిగా అందకపోవడంతో చాలా ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పనులకు స్వస్తి పలికి, సుదూర ప్రాంతాలకు వలస బాట పడుతున్నారు. నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నింద్ర మండలాల్లో వ్యవసాయ పనులు అంతంతమాత్రంగా ఉండటంతో 50 శాతానికి పైగా వ్యవసాయ కూలీలు పొట్ట చేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు కూలి పనుల కోసం వలస వెళుతున్నారు. మిగిలిన వారు స్థానికంగా ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి కూడా రెగ్యులర్‌గా కూలి డబ్బులు రాకపోవడంతో మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు, కానీ సంబంధిత అధికారులు ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప వారు చేసిన పనులకు కూలి ఇవ్వడం లేదు.

వారానికి ఒకసారైనా కూలి ఇవ్వకపోతే ఎలా..?

- సీతా, మిట్టపాలెం గ్రామం, నగరి

వారమంతా కష్టపడి చేసిన పనులకు కనీసం వారానికి ఒకసారైనా కూలి ఇవ్వకపోతే ఎలా బతకాలి.. ఇప్పటికే మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. గ్రామాల్లో ఇతర పనులకు వెళ్లే వారిని ఉపాధి పనులకు రావాలని చెబుతున్నారు. కానీ పనులు చేసిన మాత్రం నెలల తరబడి కూలి డబ్బులు ఇవ్వడం లేదు.

కనీసన వసతులు కూడా లేవు..

- రాణి, మిట్టపాలెం గ్రామం, నగరి

స్థానికంగా పనులు చేసుకోవడానికి కూలీలకు వ్యవసాయ పనులు ఏమీ ఉండటం లేదు. దాదాపు అందరూ ఉపాధి పనులపై ఆధారపడుతున్నారు. ఎండల తీవ్రత మూలంగా పనులకు వెళ్లేందుకు పలువురు జంకుతున్నారు. దూరం ఎక్కువగా ఉండటం, నీడ, తాగునీటి వసతి ఏర్పాట్లు చేయకపోతుండటం లాంటి కారణాలతో పనులకు వెళ్తే ప్రాణాలకే ముప్పన్న భావనతో కొందరు కూలీలు దూరంగా ఉంటున్నారు. దీనికి తోడు వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన వారికి సైతం కూలి డబ్బులు ఇవ్వకపోవడంతో వారు పనులకు వెళ్లడం లేదు.

మాల మహానాడు
జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ మృతి

శివకుమార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చౌడేపల్లి: మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ (35) అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్ద ఎల్లకుంటకు చెందిన శివకుమార్ మాల మహానాడు ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశారు. దీంతో మండలం తో పాటు జిల్లాలో ఆయనకు మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయి. కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన వ్యాధి తీవ్రమై తన నివాసంలో మృతి చెందాడు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమల సుదర్శనం, పలువురు సంఘాల నాయకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, రాజకీయ ప్రముఖులు శివకుమార్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు సమాచారహక్కు చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - సోమల: సోమల ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపిడివో నారాయణ బుధవారం తెలిపారు. ఈ సదస్సుకు మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి సిబ్బంది హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం: తహశీల్దారు

ప్రజాశక్తి- సోమల: నేడు సోమల మండలంలోని పెద్దఉప్పరపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లి సమీపంలోని యానాది కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సమావేశం గురువారం నిర్వహిస్తున్నామని తహశీల్దారు మధుసూదన్ బుధవారం తెలిపారు. ఎస్సి, ఎస్టి మండల, గ్రామ స్థాయి సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, కమిటీ మెంబర్లు ఈ సమావేశానికి హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్చల్లో పాల్గొని సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి: వైసిపి

గ్రామ స్థాయి సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-వికోట: సంస్థా గతంలా వైసిపి బలోపేతానికి క్షేత్రస్థాయి నుండి నూతన కార్య వర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యువరాజ్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యువరాజ్ ఆధ్వర్యంలో పాముగానిపల్లి, ముదరందొడ్డి, బైరుపల్లి పంచాయతీలలో బుధవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల సమక్షంలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. తమ పార్టీ పాలన హయాంలో సుపరి పాలన అందించామన్నారు. రాబోవు జగనన్న ప్రభుత్వంలో కార్యకర్త లను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. గ్రామ స్థాయి కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, మండల యూత్ అధ్యక్షులు పవన్‌కుమార్, జిల్లా బూత్ కమిటీ కార్యదర్శి మావత్తూర్ మని, ఎస్సి సెల్ అధ్యక్షులు శివరాం, రైతు విభాగం అధ్యక్షులు రాధాకృష్ణరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, సోసియల్ మీడియా శివకుమార్, నేతలు కుమారరాజా, కృష్ణప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల ఇన్‌ఛార్జి సర్వేయర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఇన్చార్జి సర్వేయర్ గా గణేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు సర్వేయర్‌గా పని చేస్తున్న సునీతను ఏడీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా పాలసముద్రం సర్వేయర్‌గా పని చేస్తున్న గణేష్ గంగాధర నెల్లూరు ఇన్‌ఛార్జిగా, సర్వేర్‌గా నియమిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఎస్‌డబ్ల్యుపిసిల సందర్శన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ఎస్ డబ్ల్యు పిసి (చెత్త నుండి సంపద తయారీ కేంద్రం)ను డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఇంటింటికి చెత్త సేకరణ పనులు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ ధ్వజస్తంభ పూజకు విచ్చేయాలని ఆలయ అర్చకులు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని బుధవారం ఆహ్వానించారు. పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి ఆలయ మర్యాదలతో సన్మానించి ఆహ్వానించారు. ఈ పూజా కార్యక్రమానికి తప్పకుండా విచ్చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను ఆశీర్వదించి వారు తీర్థ ప్రసాదాలు అందించారు.

సూపర్ సిక్స్ అమలు ఎక్కడ..?: వైసిపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసేలా వాగ్దానాలు చేసి గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సమస్యలను పట్టించు కోవడం లేదని వైసిపి నియోజవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక సంతపేట, మంగసముద్రం హౌసింగ్‌కాలనీ, ఓబనపల్లిలో అధికార పార్టీ ఎన్నికల హామీలపై ప్రజలను జాగృతి చేస్తూ సమావేశాలు నిర్వహించారు.

జంగాలపల్లిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం తింగరగుంట పంచాయతీ జంగాలపల్లిలో రెండు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో గ్రామ పొలిమేర్లలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని మహిళలు విచారం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో తాగునీటి బోర్ల రెండు ఉన్నాయని అవి మూడు నెలల క్రితం మరమ్మతులకు నోచుకోవడంతో గ్రామానికి తాగునీరు సరఫరా ఆగిపోయిందన్నారు. దీనిపై అనేకసార్లు అధికారులకు, నాయకులకు తెలిపినా పట్టించుకోలేదని విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామ తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించి తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-గుడుపల్లి: అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లా డుతూ ఈ అన్న క్యాంటీన్ భవనానికి 66 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు అయిన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కు, ఆయన సతీమణి భువనేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ఆ పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ పార్టీ అధ్యక్షులు హేమంబరు గౌడు, మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, , పోగురుపల్లి యూనిటీ ఇన్‌ఛార్జి గోవిందస్వామి, టీవీవాడ యూనిట్ ఇన్‌ఛార్జి రామచంద్ర, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: మెడికల్ ఆఫీసర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జ్వరాలు, జలుబు, దగ్గులు ఎక్కువ రోజులు వుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని డాక్టర్ గురు ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎగవూరులో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీర్ఘకాలికంగా జ్వరాలు, దగ్గులు ఉంటే వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖలో హమాలీలుగా పని చేస్తున్న వారికి ఉచిత వైద్య పరీక్షల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్ భగవతి, సంపత్, ఏఎన్ఎం మాధవి, మమత వైద్య సిబ్బంది కదిరానన్, సుధాకర్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

విజయపురం (నగరి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కార్యాలయంలో పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత, తాగు నీరు వలన ప్రబలే వ్యాధులను అరికట్టడంపై అవగాహన కల్పించారు. సత్రవాడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎయిల్ అరసన్ మాట్లాడుతూ ప్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. అలా చేస్తే దోమలు పెరగ కుండ కట్టడి చేయవచ్చన్నారు. పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బిందు మాట్లాడుతూ పరిసర ప్రాంతలు, ఖాళీ స్థలాలలో నిలిచే నీటిని తొలగించాలన్నారు. వీటిపై పురపాలక సిబ్బంది తనిఖీ చేయలని సూచించారు. ఈ కార్యక్రమములో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పారిశుద్ధ్య పర్యవరణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండలంలోని పొన్నేడుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి హేమలత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు హాజరు శాతం పరిశీలించారు. విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. తరువాత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల నిర్వహణపై పలు సలహాలు, సూచనలు అందిందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి , ఉపాధ్యాయులు, సిఆర్‌పి చిట్టిబాబు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి-తవణంపల్లె: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మల్లకుంట సచివాలయ పరిధిలోని కృష్ణాపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులతో డెంగీపై కృష్ణాపురం పుర వీధులలో బుధవారం అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియాలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్ సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్లు పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అకౌంట్‌కు ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి -సోమల: అన్నదాత సుఖీభవ ఆగస్టు మాసం రెండవ తేదీ ప్రభుత్వం రైతుల అకౌంట్లో అమౌంట్ జమ చేయనున్న నేపథ్యంలో మండలంలోని 78 మంది రైతులకు వారి బ్యాంకు అకౌంట్లకు ఎన్పీసీఐ లింక్ అనుసంధానం లేనందున సంబంధిత రైతులు వారి వారి అకౌంటు ఉన్న బ్యాంకులకు వెళ్లి ఎన్‌పిసిఐ యాక్టివ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. పలు రైతు సేవా కేంద్రాల పరిధిలో సమస్య ఉన్న రైతులను గుర్తించామని వారు మాత్రమే బ్యాంకుకు వెళ్లి లింకు అప్‌డేట్ చేసుకోవాలని సంబంధిత జాబితాను ఆయా రైతు సేవ కేంద్రాలకు సంబంధిత రైతులకు స్వయంగా పంపించారు. వారు రెండవ తేదీ లోపు సమస్య పరిష్కరించుకుంటే అన్నదాత సుఖీభవ అమౌంట్ వారి వారి ఖాతాలలో జమ అవుతుందని తెలిపారు. రైతులు గుర్తించి సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ చాందిని ప్రియ, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి: వైసిపి

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైసిపి విద్యార్థి విభాగం నాయకులు

ప్రజాశక్తి- చౌడేపల్లి: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వైసిపి విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టళ్ల బాట పట్టినట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా చౌడేపల్లి మండలం లోని ఎస్‌సి బాలికలు, బాలురు, బిసి బాలుర వసతి గృహలను బుధవారం పరిశీలించామని ఆయన వివరించారు. వసతి గృహాల్లో సమస్యలు ఏవైనా ఉంటే ఆ పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. వసతి గృహాల విద్యార్థిని విద్యార్థుల సమస్య లు ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బీసీ బాలుర వసతి గృహానికి దారి సమస్య వుందని విద్యార్థులు తెలిపారని పార్టీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన వివరించారు . అనంతరం ప్రతి హాస్టల్లోనూ మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మంజునాథ్, బిసి నాయకులు గోపీనాథ్, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి నాగేంద్ర, విద్యార్థి నాయకులు మల్లికార్జున, గోవర్ధన్, గణేష్ పాల్గొన్నారు.

బలిజ సామాజిక వర్గానికే కేటాయించాలి

పలమనేరు సింగిల్ విండో ఛైర్మన్ పదవిపై ఎమ్మెల్యేకు బాస్ నాయకుల వినతి

ప్రజాశక్తి- పలమనేరు: సలమనేరు సింగిల్ విండో ఛైర్మన్ పదవిని మా సామాజిక వర్గానికే కేటాయించాలని బాస్ నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం నాయకులు (బాస్) ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలమనేరు సింగిల్ విండో ఛైర్మన్ పదవి తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే కేటాయించాలని వారు విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించడంతో వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు సుధాకర్, రూపేష్, శ్రీధర్, కోటేశ్వర్, బాబు, డిష్ రమేష్,మోహన్, అరుణ్, హరీష్ పాల్గొన్నారు.

మెమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బాస్ నాయకులు

సప్లై ఛానల్ పనులు ప్రారంభం

భూమి పూజ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం సమీపంలోని కనుమ నాయనపల్లి పెద్ద చెరువు సప్లై ఛానల్ పనులను కూటమి నేతలు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. పంచాయతీరాజ్ ద్వారా ఏడు లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంతో పనులను ప్రారంభిం చారు. అభివృద్ధి సంక్షేమాలు కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని టిడిపి నేతలు పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు ముఖ్య మంత్రి చంద్రబాబు అవసరమైన నిధులు విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, పద్మనాభరెడ్డి, రామ కృష్ణప్ప, రవి రెడ్డి, సలాం సాబ్, బాలు, సుబ్రి, ఆదిల్ ,కేశవరెడ్డి, మంజునాథ్, మురళీమో హన్ తదితరులు పాల్గొన్నారు.

కోడె దూడలతో అధిక ఆదాయం

- డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాసు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పాడి పశువులలో కోడె దూడలు పుడితే వాటి ద్వారా అధిక లాభాలు వస్తాయని పిటిపి కో ఆర్డినేటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాసు అన్నారు. బుధవారం మండలంలోని కటిక పల్లి పంచాయతీ కటిక పల్లెలో పశు సంతతి పరిశీలన పథకంపై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సంకరజాతి జెర్సీ పశువు ల్లో పాల దిగుబడిని పెంచడానికి మంచి జన్యు సామర్థ్యం కలిగిన కోడె దూడల ప్రాముఖ్యత చాలా ఉందని రైతు లకు వివరించారు. వీటికోసం జన్యు సామర్థ్యం ఎక్కువగా ఉన్న కోడెదూడలను రైతుల నుంచి సేకరించి కేంద్రా ల్లో ఉంచి వాటి నుంచి వీర్యం సేకరించి కోడె దూడ లను పుట్టి స్తున్నామని, మేలు జాతి దూడలను రైతుల నుంచి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రైతులు కోడే దూడల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వాటిని సరైన పద్ధతిలో పోషించి ప్రభుత్వానికి పంపి ప్రతిఫలం అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తయ్యూరు పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య, పిటిపి డాక్టర్లు డాక్టర్ యోగానంద రెడ్డి, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఆదిత్యానంద రెడ్డి, వి సుధాకర్, నిరంజన్ కుమార్ వినీత్, పాడి రైతులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు కష్టాలు

- అందుబాటులో లేని నెట్‌వర్క్
- అవస్థల్లో వినియోగదారులు

ప్రజాశక్తి -బంగారు పాల్యం: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ సెల్ ఫోన్లు వాడే వినియోగదారులకు సిగ్నల్స్ కష్టాలు అధికమై పోతున్నాయి. గత ఐదు రోజులుగా బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందుబాటులేక వినియోగదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. స్పందించాల్సిన బిఎస్ఎన్ఎల్ సిబ్బంది స్పందించకుండా ఫోర్ జి ఉన్న స్థానంలో హెచ్‌ప్లస్, ఈ నెట్‌వర్క్ అందుబాటులోకి రావడంతో ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ నెట్‌వర్క్ 5 జి స్థానంలో ముందుకెళుతుంటే బిఎస్ఎన్ఎల్ తిరిగి మొదటి స్థానానికి చేరుకుంటుందని నెట్‌వర్క్ ఇబ్బందులతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రైవేట్ నెట్ వర్క్‌పై ఆధారపడవలసిన అవసరం ఏర్పడు తుందని ఇకనైనా సం బం ధిత అధికా రులు నెట్ వర్క్‌ను పున రుద్ధరించి బిఎస్ ఎన్ఎల్ విని యోగదా రులకష్టాలు పరిష్కరిం చాలని వినియోగదారులు కోరు కుంటు న్నారు.

ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశం

మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం మోటుమల్లెల గ్రామ పంచాయతీ నగరి దళితవాడలో ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో ఎస్ మధుసూదన్ రెడ్డి, తహశీల్దారు అమరనాథ్, ఎంఈఓడి శ్రీనివాసులు, రొంపిచర్ల ఎస్ హెచ్‌ఓ చంద్రశేఖర్, తదితర అధికారులందరూ సివిల్ రైట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళితులు తమ గ్రామంలో మృతదేహాలను పూడ్చిపెట్టేందుకు శ్మశాన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్థలం భూమిని కేటాయించాలని తహశీల్దారు అమరనాథ్‌ను కోరారు. స్పందించిన తహశీల్దారు స్థల సేకరణ చేసి శ్మశానం కేటాయిస్తామని తెలిపారు. గ్రామంలో మురుగునీటి కాలువలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డికి గ్రామస్తులు విన్నవించుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో పేడ దిబ్బలు ఎక్కడపడితే అక్కడ వేశారని, వీటివల్ల అంటు రోగాలు వస్తాయని, వాటిని తొలగించాలని సూచించారు. గ్రామంలో మురికినీటి కాలువలు నిర్మించేందుకు, శ్మశానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రొంపిచర్ల పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కులు, సైబర్ క్రైమ్ , దేవాల యాల్లోకి అగ్రవర్ణాల వారు ఎవరైనా రానీయ కుండా అడ్డుకుంటుంటే తమకు తెలపాలన్నారు. ఎంఈఓ డి శ్రీనివాసులు మాట్లాడుతూ కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయిలోకి ఎదగాలని సూచించారు. ప్రతి మండలంలో మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేశామని, ప్రతి 60 మంది విద్యార్థులకు ఐదుగురు టీచర్లు ఉంటారని , పిల్లలందరినీ బడికి పంపించాలన్నారు. ఆరవ తరగతి నుంచి రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారని, ఆపై తరగతులు చదువు కున్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శివకుమార్, వీఆర్వో దామోదర్, నగిరి దళితవాడ గ్రామస్తులు, రొంపిచర్ల మండల అధికారులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యుత్ స్టార్టర్ చోరీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : ఓ రైతు విద్యుత్ స్టార్టర్ చోరీకి గురై 12 వేల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఆలపల్లి పంచాయతీ పరిధిలోని మీట్టపల్లి గ్రామంలో మేఘనాథ్ రెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇతనికి విద్యుత్ సర్వే నెంబర్లు 56లోని బోర్ మోటార్‌కు విద్యుత్ స్టార్టర్ అమర్చాడు. మంగళవారం రాత్రి నీరు వదిలేందుకు స్టార్టర్ ఆన్ చేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా స్టార్టర్ కనిపించలేదు. ఎవరైనా దుండగులు పంట పొలాల్లో పారేశారేమోనని సందేహంతో పరిసర ప్రాంతాలన్నీ చూశాడు. విద్యుత్ స్టార్టర్‌ను దొంగతనానికి గురైందని, వెతికి తమకు అప్పగించేలా చర్య చేపట్టాలని స్థానిక ఎస్ఐ పరశురాముడుకు బుధవారం ఆ రైతు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ పరశురాముడును విచారణ కోరగా బాధిత రైతు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డిస్టిలరీ ఫ్యాక్టరీ తనిఖీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని నెలవాయి వద్ద వున్న ఎస్ ఎన్ జె డిస్టిలరీ ఫ్యాక్టరీని చిత్తూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ విజయ్ కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యాక్టరీలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు ఫ్యాక్టరీ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఏజీఎం రవికుమార్, హెచ్ఆర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి- కార్వేటినగరం: వసతి గృహాల్లో ఉన్న పేద విద్యార్థులకు మెనూతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. బుధవా రం మండల కేంద్రంలోని ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని సంద ర్శించారు. ఈ సంద ర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వసతి గృహాల్లో తలదాచుకుంటున్న పేద విద్యార్థులకు ప్రతి పూటకు మెనూ ప్రకారం నాణ్యమైన విందు భోజనం సరిపడే విధంగా అందించేలా చూడాలని ఆదేశించారు. పిల్లలకు సాయంత్రం ట్యూటర్ల ద్వారా విద్యాబోధన సౌకర్యం కల్పించి పిల్లల సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం నిర్మాణం చేపట్టిన మరుగు దొడ్లు, స్నానపు గదులను పరిశీలించి త్వరగా మర్మమతు పనులను పూర్తి చేసి వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని హాస్టల్ వార్డన్‌ను ఆదేశించారు.

విధినిర్వహణలో అలసత్వం వద్దు

-జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుధారాణి

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి సుధారాణి

ప్రజాశక్తి -కార్వేటినగరం: విధినిర్వహణలో సిబ్బంది ఆలసత్వం విధిస్తే సహించేది లేదని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ డీటీ సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, రోగుల నుంచి ఫిర్యాదులు అందినా వెంటనే శాఖ పరమైన చర్యలు తప్పదన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో వ్యాధులపై అవహగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమి ఆరోగ్యకేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరైన భవనం లేక పోవడంతో వర్షాలకు ఉరుస్తున్నాయని, మందులు తడిసిపోతున్నట్లు జిల్లా వైద్యాధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందిస్తూ త్వరలో అనుకూలమైన భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు, డీపీఎంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ గిరి డాక్టర్ అనుష పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండా: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం : కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పడగొట్టడం.. కూలగొట్టడం చాలా ఈజీ.. కానీ నిలబెట్టడం.. నిర్మాణం చేయడం అంటే చాలా కష్టంతో కూడుకున్న వ్యవహారంగా ఉంటుందన్నారు. నిర్మాణం చేయాలన్నా అది చంద్రబాబు తోనే సాధ్యం అని మరోసారి సింగపూర్ టూర్ ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టత ఇచ్చారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు పర్యటించారన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తమకు సహకరించాలని చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య కోరారు. బుధవారం ఉదయం స్థానిక రైల్వేస్టేషన్‌లో రూరల్ ఎడ్యుకేషన్ అండ్ లిబర్టీ సంస్థ (రియల్) ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు తమ స్టేషన్ పరిధిలో బాల్య వివాహాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రియల్ సంస్థ జిల్లా అధ్యక్షులు రామారావు, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ హనీషా, రియల్ సంస్థ కమ్యూనిటీ సోషియల్ వర్కర్స్ ఆఫీజాబేగం, జయశ్రీ, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాధారాణి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): సమావార చట్టం విప్రజాయుధం లాంటిదని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 యేళ్ల పూర్తయిన సందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగం, ఆర్‌టీఐ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారాన్ని తగిన విధంగా ఉపయోగించు కోవడం ద్వారా హక్కులను కాపాడుకోవచ్చునని, అవినీతిని వెలికి తీయవచ్చునని, నిజమైన ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సమాచార హక్కు చట్టం ప్రకారం భారతీయ పౌరుడు తనకు కావలసిన సమాచారాన్ని ప్రభుత్వం నుండి పొందే హక్కు లభించిందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కర రాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వలన ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీ తనం, ప్రజా సాధికారత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ విభాగాలలో విజేతలుగా నిలిచిన సౌమ్య, నాగలింగం, మోహన్, భవ్య, మోనిష, గాయత్రి, పవిత్రలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూ కోఆర్డినేటర్ డాక్టరు ఇందిరా ప్రియదర్శిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టరు మహేశ్వరి, ప్లేస్ మెంట్ విభాగం కోఆర్డినేటర్ డాక్టరు పంకజ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టరు భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సమాచార చట్టాన్ని ఉల్లంఘించరాదని ఎంపీడీవో మహేష్ బాబు అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల వ్యవధిలో సమాచారం అందించాలని లేనిపక్షంలో దానిపై అపిల్ కు వెళతారన్నారు. తర్వాత రాష్ట్ర కమిషనర్ దగ్గర సమాచారాన్ని పొందే విధంగా చట్టంలో నిర్దేశించారన్నారు. సమాచారం అడిగిన వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని ప్రతి శాఖలోనూ సమాచార చట్టం బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో , పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

చికెన్, మటన్, హోటల్ వ్యాపారుల సమావేశం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని చికెన్, మటన్ మాంసపు దుకాణదారులు, అన్ని హోటళ్ల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శానుసారం బంగారు కుటుంబాలను (పీ4 కుటుంబాలు) మార్గదర్శ కుటుంబాలు (ఉన్నత కుటుంబాలు) తో అనుసంధానించడం, బంగారు కుటుంబాల ఉన్నతికి మార్గదర్శ కుటుంబాలు ప్రతి ఇంటి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి పి4తో సాధ్యమతుందన్నారు. ఈ సమావేశంలో కొందరు చికెన్, మటన్ మాంసపు దుకాణదారులు, హోటల్ యజమానులు మార్గదర్శకులుగా అంగీకారం తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో 120 మైక్రాన్ ల కన్నా తక్కువ మందం ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలులో వుందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. అంతేకాకుండా పారిశుధ్య నిర్వహణపై అందరి సహకారం కావాలని కోరారు. నిల్వ ఉంచిన మాంసం విక్రయించొద్దని ఆహార పదార్థాలకు కలర్ కోటింగ్ ఇవ్వొద్దని సూచించారు. ఫ్లోర్‌ను ప్రతిరోజు శుభ్రంగా ఉంచుకోవలని సూచించారు. అంటు వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేష్ బాబు, మునిసిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, స్నేహ ప్రియ, పురపాలక సంఘ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని చికెన్, మటన్ మాంసపు దుకాణదారులు, అన్నీ హోటళ్ల యజమానులు, ఇతరులు పాల్గొన్నారు.